ముంచెత్తిన వాన

- కొండవాలు.. బిక్కు బిక్కు..
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగిపొర్లిన గెడ్డలు
- చెరువులను తలపించిన రోడ్లు

పెదగంట్యాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం వర్షం దంచికొట్టింది. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన వాన సాయంత్రం తెరిపిచ్చింది. ఆదివారం ఏకధాటిగా కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. రహదారులన్నీ చెరువులను తలపించాయి. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఆకాశంలో మబ్బులు మొదలయ్యాయి. ఆ తర్వాత చిన్నగా వర్షం ప్రారంభమైంది. అటుపై ఏకధాటిగా కురిసింది. సాయంత్రం వరకూ ఒకే రీతిన వాన పడడంతో మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో స్థానికులు బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాలైన బర్మా కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, డైరీ కాలనీ, రిక్షా కాలనీ, రామచంద్రనగర్,77వ వార్డు పరిధి పాలవలస, దేవాడ ప్రాంతాల్లోని నివాసితుల ఇళ్లముందు భారీగా నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు సాగించలేకపోయారు.రైతుబజార్‌లోకి వర్షం నీరు చేరడంతో రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా ప్రధాన గెడ్డలు పొంగిపొర్లాయి.

బితుకు.. బితుకు

దయాల్‌నగర్, రాజీవ్‌నగర్ మార్గ్, భానోజీ కాలనీ తదితర కొండవాలు ప్రాంత ప్రజలు రోజంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఒకే రీతిన వర్షం పడడంతో ఏక్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందారు. దయాల్‌నగర్ కొండపైనే అనేక ఇళ్లు ఉన్నాయి. అయితే వర్షం ధాటికి రాళ్లు, మట్టి పెళ్లలు విరిగి తమ ఇళ్లపై పడేలా ఉండడంతో ప్రాణాలను అర చేతిలో పెట్టుకున్నారు.

నీట మునిగిన పాలవలస

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పాలవలస గ్రామం నీట మునిగింది. ఆదివారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి గ్రామం మొత్తం నీటితో నిండిపోయింది. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో అవస్థలు పడ్డారు. ఇళ్ల నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. దీంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

పూడికల తొలగింపు

ఆదివారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో గెడ్డలు పొంగిపొర్లాయి. అయితే ఆయా గెడ్డల్లో పూడికలు పేరుకుపోవడంతో వర్షపునీరు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. ఇళ్లలోకి నీరు రావడంతో అప్రమత్తమైన జీవీఎంసీ ప్రజారోగ్య శాఖాధికారులు స్పందించారు. వెంటనే పొక్లెయిన్ల సాయంతో ఆయా గెడ్డల్లోని పూడికలు, చెత్తాచెదారం తొలగించారు. సాయంత్రానికి వర్షపునీరు సాఫీగా సాగిపోయింది. అలాగే పెదగంట్యాడ నుంచి గంగవరం వెళ్లే రోడ్డులో శ్రావణ్ షిప్పింగ్ ప్రాంతం మొత్తం జలమయమైంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోలకు ఇబ్బందులు పడ్డారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల కారణంగా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పెదగంట్యాడ తహసీల్దార్ అమల తెలిపారు. రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ఐదుగురు వీఆర్వోలను అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 6302077190, 7981237292, 9390157980, 9010386930, 9908736997. 9676107611 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. పాలవలస గ్రామాన్ని వర్షపునీరు ముంచెత్తడంతో జీవీఎంసీ సహకారంతో గెడ్డల్లో పూడికలు తీయించామన్నారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తం చేయడంతో పాటు పొక్లెయిన్లను కూడా అక్కడే ఉంచామన్నారు.

అగనంపూడి: అల్పపీడన ప్రభావం వల్ల ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న జోరు వానకు గెడ్డలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్ని చోట్ల రహదారులు నీటి ప్రవాహానికి కోరుకుపోతున్నాయి. అగనంపూడి కూడలికి రెండు వైపులా ప్రధాన కాలువ వద్ద జాతీయ రహదారి పలుచోట్ల కోతకు గురైంది. కాలువలు ఉధృతంగా పారుతున్నాయి. నిర్వాసిత కాలనీలు, బొర్రమ్మగెడ్డలోకి భారీగా వరద నీరు చేరింది. గెడ్డను ఆనుకొని ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సూచించారు.


పాలవలసలో ఇళ్లలోకి చేరిన వరదనీరు


కోతకు గురైన రోడ్డు


నడుపూరులో చెరువును తలపిస్తున్న ఉక్కు కళావేదిక ప్రాంగణం


జోరుగా పారుతున్న నీరు



సీతానగరం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు


వర్షపు నీటితో నిండుకుండలా ప్రవహిస్తున్న గెడ్డ


పాలవలసలో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం


పాలవలసలో నీటి మళ్లింపును పర్యవేక్షిస్తున్న అధికారులు


పోర్టు వంతెన గెడ్డలో పూడికలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది


దయాల్‌నగర్ కొండవాలు ప్రాంతం

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం విజయవంతం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెదగంట్యాడ: కంటి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల చూపు పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు. జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ గౌరీ సేవా సంఘం భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గౌరీ సేవా సంఘం, మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో పలు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి ఆపరేషన్లను అవసరమైన కొంతమందిని నగరంలో ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మానస,మౌనిక, లలిత్, రవికుమార్, కుసుమ, పావని తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం


మృతుని భార్యకు నగదు అందజేస్తున్న కళింగ సంఘం సభ్యులు

పెదగంట్యాడ: కుటుంబ పెద్ద అకస్మాత్తుగా మృత్యువాత పడితే ఆ కుటుంబం పరిస్థితి దారుణంగా ఉంటుందని, అటువంటి కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలని కళింగ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎండా ఆదినారాయణ అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని నడుపూరు శిరవానిపాలేనికి చెందిన గురుబెల్లి ప్రకాశరావు అనే వ్యక్తి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబాన్ని ఆదివారం కళింగ సంఘం సభ్యులతో కలసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కళింగ సంఘం కుటుంబాల నుంచి సేకరించిన రూ. 40వేలను మృతుడి భార్యకి అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కూన వెంకటరమణ, భగవతి వెంకటరమణ, ఎండా కృష్ణ, బలగా లక్ష్మణరావు, హరినాథ్, దాసు, జయరాం పాల్గొన్నారు.

నేడు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పలు విభాగాల ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ల జారీ చేయడానికి నిరసనగా సోమవారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేయనున్నారు. అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు ధర్నాకు హాజరు కావాలని పోరాట కమిటీ నాయకులు కోరారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ధర్నా చేయనున్నట్టు పేర్కొన్నారు.

అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం


పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు పెంటమాంబ ఆలయ ఆవరణలో కొలువుదీరిన మహాశక్తి, భూలోకమ్మ, దుర్గాలమ్మ, కుంచుమాంబ, మరిడిమాంబ, శ్రీశక్తి అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమాలు నిర్వహించారు. నెల్లిముక్కు గ్రామ పెద్దలు, దొడ్డి పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలను చకచకా పూర్తి చేస్తామన్నారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, గొందేశి సత్యారావు, గంట్యాడ పైడిరాజు, మొల్లి రమణ, కేఎస్ రెడ్డి, పిట్టా కుంచారావు, శ్రీరామ్మూర్తి, అప్పారావు, రామారావుపాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో శనివారం జరిగిన చోరీ కేసులో నిందితుడు పోలీసుల అదుపులోఉన్నట్టు తెలిసింది. సౌత్ డివిజన్ క్రైం పోలీసుల విచారణలో భాగంగా దొంగతనం జరిగిన క్వార్టర్ ఎదురుగా ఉన్న సీసీ కెమెరాలో నమోదైన పుటేజీ ఆధారంగా నిందితుడు పాత నేరస్తుడుగా గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. ఒకట్రెండు రోజుల్లో పోలీసులు కేసు వివరాలు తెలియజేయనున్నట్టు తెలిసింది.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్


స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న సంఘాల ప్రతినిధులు

అగనంపూడి: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో స్వచ్ఛ రైల్వేస్టేషన్ కార్యక్రమం చేపట్టారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్ ప్రదేశంలో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, చెత్తాచెదారం తొలగించారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు, బుకింగ్ కౌంటర్ ఎదురుగా, వీఐపీ లాంజ్ వైపు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. తర్వాత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. మానవతా సర్వీస్ ఆర్గనైజేషన్, మానవ వికాస వేదికలు సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు కుంచుమూర్తి ఈశ్వర్, వి.జాషువ, కె.వీర్రాజు, ఎంఎస్ఎన్‌మూర్తి, కామేశ్వరరావు, గుదే సుశీలా గజేంద్రరావు, సుందర్‌మూర్తి, విజయ్‌కుమార్, బుచ్చిరాజు, వీఆర్‌కేరాజు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఆశీర్వాదం, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

23న జాబ్ డ్రైవ్

సీతంపేట: డాటాప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ రంగినేని సాయిప్రసాద్ తెలిపారు. శంకరమఠం రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఈసారి ప్రభుత్వ సెలవు కారణంగా కార్యక్రమాన్ని నాలుగో శనివారానికి మార్చినట్టు చెప్పారు. సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, బెలా మాంక్స్, ఆల్ హాండ్స్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, కాన్‌సెంట్రిసిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్, తాయో లాబ్స్, సుదర్శిని సొల్యూషన్స్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, యువత, నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సిద్ధవరపు ప్రసాద్, జనరల్ మేనేజర్ కిశోర్ వర్మ, ఎంవీపీ సెంటర్ మేనేజర్ రవి పాల్గొన్నారు.

'సృష్టి గర్భ' పుస్తకావిష్కరణ


గ్రంథ కర్త విజయభాస్కర్‌ను బిరుదుతో సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: నాటక రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన 'సృష్టి గర్భ' (ఉపనిషత్ కాంతి) పుస్తకావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉపనిషత్తులలోని లోతైన భావాలను హృదయానికి హత్తుకునేలా రచయిత పుస్తకంలో పొందుపర్చారన్నారు. ప్రస్తుత ప్రపంచం భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల వైపే చూస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి రచనలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా గ్రంథ కర్త విజయభాస్కర్‌కు నాటక రత్న బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. గ్రంథ కర్త మాట్లాడుతూ తీరని ఆధ్యాత్మిక ఆర్తితో సల్పిన సత్యశోధన, నిత్య సాధనలో పొందిన ఆత్మజ్ఞానం, దైవ కృపతో రాసిన గ్రంథమే సృష్టి గర్భ ఉపనిషత్ కాంతి అని తెలిపారు. విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పాలమరశెట్టి ఫ్రాన్సిస్, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, ప్రవచనకర్త రామకృష్ణానంద్, రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు, వాగ్గేయకారుడు అందెశ్రీ, న్యాయవాది అల్లు కేశవ జోగినాయుడు, కళాపీఠం అధినేతలు బి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


సుబ్రహ్మణ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి ఇంటికి చేరలేదు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. గంగవరం పోర్టులో పనిచేస్తున్న ఎస్.సునీల్ కుటుంబంతో సెక్టార్-1లోని 15 ఇ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. శనివారం సాయంత్రం సునీల్ తండ్రి సుబ్రహ్మణ్యం (76) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లారు. రాత్రి అయినా అతను తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో ఆదివారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య పూజలు ప్రారంభించారు. 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీవీఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించండి


ఉదయ్ భాస్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గణేష్‌కుమార్

మహారాణిపేట: స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. ఆదివారం విశాఖలో మునిసిపల్ డైరెక్టర్ పర్సనల్ సెక్రటరీ ఉదయ్ భాస్కర్‌ను సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఎంతో అవగాహన కలిగిన ఉదయ భాస్కర్ మునిసిపల్ డైరెక్టర్ పర్సనల్ సెక్రటరీగా నియమితులు కావడం తమ అదృష్టమన్నారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించి, పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా నాయకులు బి.వి.అశోక్ కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అయోమయం.. గందరగోళం!


కూర్మన్నపాలెం బస్టాప్‌లో ఆటో ప్రయాణానికి సిద్ధమవుతున్న మహిళలు


ఆటో ఎక్కుతున్న మహిళలు

- ఉచితబస్సు ప్రయాణానికి నిబంధనాలు
- కొన్ని బస్సులకే పరిమితం చేయడంతో ఇబ్బందులు
- ఆటోలు, ఇతర సాధనాల్లో మహిళల ప్రయాణం

కూర్మన్నపాలెం: ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఏ బస్సులో ప్రయాణం చేయాలో తెలియక కొంతమంది.., ఉచిత బస్సు ఎప్పుడో వస్తుందిలే అని మరి కొంతమంది అయోమయంలో పడిపోతున్నారు. అందు వల్ల బస్సు కోసం ఎదురు చూడకుండా ఎప్పటిలాగే ఆటోలకే ప్రాధాన్యం ఇవ్వడం కనిపిస్తోంది.

ఇదీ పరిస్థితి

స్త్రీశక్తి పథకాన్ని ప్రభుత్వం అతి తక్కువ బస్సులకే పరిమితం చేసింది. అంతేకాకుండా కాంట్రాక్ట్ బస్సుల్లో అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. దీని వల్ల కాస్తో కూస్తో చదువుకున్న వాళ్లు వాటిని గుర్తించి ప్రయాణం చేయగలుగుతున్నారు. ఎక్కువ శాతం మంది మహిళలు ఆ బస్సులను గుర్తించలేక పోవడం.. తీరా ఎక్కిన తర్వాత కండక్టర్ అనుమతించక పోవడంతో అందరి ముందు తలదించుకోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. అందువల్లే ఆటోలను ఆశ్రయించి తమ పనులు ముగించుకుంటున్నారు.

వీటికే పరిమితం

పల్లెవెలుగు, సిటీ ఆర్డనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి ఐదు రకాల సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తుంది. మిగిలిన సర్వీసుల్లో ఈ పథకం అమలుకాదు. ఆర్టీసీ ప్రకటించిన ఆ కొద్ది సర్వీసులు అడపాదడపా మాత్రమే నడుస్తుంటాయి. అవికూడా ఎక్కువ శాతం లూపులైన్లో తిరుగుతుంటాయి. అందువల్ల అవి ఎప్పుడూ రద్దీగా ఉంటున్నాయి. అలాంటి బస్సులు సిటీలోని రోడ్లపైకి వచ్చే సరికి ఖాళీ ఉండడం లేదు. అందు వల్ల ప్రజలు ఉచిత బస్సుకో దండం అంటూ చేతులు జోడించేస్తున్నారు. ఆ బస్సు కోసం వేచి ఉంటే తమ పనులు ఎక్కడివి అక్కడే ఆగి పోతాయని పలువురు మహిళలు బస్సుకోసం వేచి చూడకుండా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఆటోవాలాలు ఎక్కడ ఆపమంటే అక్కడ ఆపి దించుతుండడంతో వాటిపైనే మక్కువ చూపుతున్నారు. ముఖ్యంగా కూర్మన్నపాలెం వంటి ప్రాంతంలో పల్లె వెలుగులు, ఆర్డనరీ సర్వీసులు అంతంతమాత్రంగానే ఉంటాయి. ఎక్కువ శాతం దూర ప్రాంతాల నుంచి వచ్చే కాంట్రాక్టు బస్సులు, అంతరాష్ట్ర సర్వీసులు, సపష్తగిరి , సూపర్ డీలక్సు, నాన్‌స్టాపు, ఏసీ బస్సులు ఇక్కడ ఆగుతుంటాయి. వాటిల్లో ఉచిత ప్రయాణం చేయడానికి అనుమతులు లేవు. అందు వల్ల మహిళలు ఉచిత బస్సుపై ఆసక్తి చూపకుండా దొరికిన రవాణా సౌకర్యాన్ని వినియోగించుకుంటుకున్నారు. కూర్మన్నపాలెం ప్రధాన రహదారి బస్టాప్‌లో బస్సు ఆగినా దాన్ని కాదని మహిళలు ఆటోలు ఎక్కడం గమనార్హం.


ఆటోలో ప్రయాణం చేస్తున్న మహిళలు